# థేంక్స్ టు, ఫ్రాన్సిస్

ఒక్కసారిగా ఆ ఆవరణలోని వాతావరణం వేడెక్కింది. బయట చిన్న చిన్న జల్లులుగా పడుతున్న వర్షం. ఆకాశంలో పలచగా విస్తరిస్తున్న మబ్బులు. ఆ కార్యాలయపు గది కిటికీల్లోకి మెల్లగా చొచ్చుకుని వస్తున్న శీతల పవనాలు. అయినా ఆ గదిలో మనుషుల ఆవేశాలతో, చిరు కోపాలతో ఆ వాతావరణం వేడెక్కింది. ఆ టీ బ్రేకు సమయంలో అంతా గుంపులుగా చేరి రహస్యంగా మాట్లాడుకుంటున్నారు. ఆ గదిలోనికి పైనుంచి పాకిన నైట్‌క్వీన్ పరిమళం వారికి ఏ ఆహ్లాదమూ కలిగించడం లేదు. వారికి ఆవేదన కలిగించిన టైప్ చేసిన కాగితం ఆ గది గోడమీది నోటీసు బోర్డుపై రెపరెపలాడుతోంది.

ఒకాయన కొంచెం స్వరం పెంచి, "ఔనండి, ఒక తెలుగువాడు, ఇంకొక తెలుగువాడిని పైకి రానివ్వడు. మీకు తెలుసుగా కప్పల జోకు..." అంటూ ఏదో చెప్పబోయాడు.

"ష్.... గట్టిగా అరవకు.... బాస్ వస్తున్నారు, సెమినార్ రూమ్‌లో మీటింగ్ అట...." అన్నాడింకొక వ్యక్తి. అంతలో వారి బాస్ అంటే వారంతా పనిచేస్తున్న ఆ ఇంగ్లీషు దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ కమ్ పబ్లిషర్ భార్గవ ఆ గదిలోకి ప్రవేశించారు. ఒక్క సారిగా ఒక సుగంధ భరితమైన పరిమళం ఆ చుట్టుపక్కల వ్యాపించింది. కారణం ఆయన రాసుకున్న సెంటు. గోధుమ రంగు సూటులో, ఏటవాలు గీతలున్న నెక్‌టైతో యాభయ్యేళ్ళ భార్గవ హుందాగా వున్నాడు. ఆయన వెనకే న్యూస్ ఎడిటర్ డిసౌజా, తెల్లగా, పొడుగ్గా నలభయ్యేళ్ళ వయసు. లాల్చీ పైజమా, భుజాన సంచీ, పల్చగా పెరిగిన గెడ్డం.

బాస్ తమతో అత్యవసరంగా ఏదో చెప్పబోతున్నారనే విషయం అక్కడున్న వారందరికీ అర్థమయింది. తరచూ ఆయన తన సిబ్బందితో

ఇంటరాక్ట్ అవుతూ వుంటారు. అలాచేస్తే సిబ్బందికి, యాజమాన్యానికి మధ్య కమ్యూనికేషన్ గేప్ వుండదని ఆయన అభిప్రాయం. అంతా గబగబా ఆ సెమినార్ హాల్‌లోకి ప్రవేశించారు. ఆ హాల్లోని గుండ్రటి బల్లకు ఎదురుగా వున్న రెండు కుర్చీల్లో భార్గవగారు, డిసౌజా ఆశీనులయ్యారు.

భార్గవగారు గొంతు విప్పారు. "మిత్రులారా! నేను మీతో సమావేశం అవ్వడానికి కారణం. ఒక సంవత్సరం పాటు మీనుంచి నేను దూరం అవుతున్నానని చెప్పడానికి, నేను అమెరికా వెళ్తున్నాను. మా అబ్బాయి దగ్గరకు అక్కడో ప్రాజెక్టు ప్రారంభిస్తున్నాము. నా బాధ్యతల్ని మన సహచరుడు డిసౌజా గారు నిర్వహిస్తారు. ఆయనను ప్రధా సంపాదకుడిగా ప్రమోట్ చేస్తూ ఇచ్చిన ఆఫీస్ ఆర్డర్ మన నోటీసు బోర్డు మీద మీరు చూసే వుంటారు." అంటూ ఆయన అందరి వంకా చూసాడు.

ఎవరిలోనూ చలనం లేదు, అంతా ముభావంగా ఉన్నారు. ఆ సెమినార్ హాల్‌లో మౌనం రాజ్యమేలింది. ఆయన ఆలోచనలో పడ్డారు. తను ఏదైనా విషయం ప్రతిపాదించినపుడు ఆ హాలు చప్పట్లతో మారుమ్రోగేది. మరిపుడు అందరిలోనూ ఏమిటీ నిర్లిప్తత? తను తీసుకున్న ఈ నిర్ణయం వెనుక ముప్ఫయ్యేళ్ళ క్రిందటి జీవితానుభవం వుంది. ఆ అనుభవాన్ని వీరితో పంచుకుంటేనే గాని వీరిలోని ఈ స్థబ్ధత తొలగిపోదు అనుకున్నాడు.

అలా అనుకుంటూ ఆయన చెప్పడం మొదలు పెట్టాడు. "సంవత్సరం పాటు మీతో నాకు మాటలనేవి వుండవు. అందుకోసం మీ దగ్గర నేనిపుడు నా మనసుని విప్పుతున్నాను. ఈ మాటలు నా హృదయపు తంత్రుల సవ్వడి." అంటూ ఆయన అందరివంకా చూసారు. అందరూ ఆయన వంక ఆపేక్షగా చూస్తున్నారు. ఆయనంటే అందరికీ ఇష్టమే..! ఆ పత్రికలో పనిచేసే వారికి పూర్తి స్వేచ్ఛ ఉంది. ఆయన కొంతకాలం తమకు కనబడరనే బాధ అందరి ముఖాల్లోనూ కనిపించింది.

ఆయన మళ్ళీ నోరు విప్పారు. ఇంతలో ఒక ఉద్యోగి ఒక చిన్న కాగితం మీద ఏదో రాసి పంపారు. దానిలోని విషయం చదివిన ఆయన ముఖంలో ఏదో బాధ, అయినా క్షణంలో సర్దుకుని, "మీలోని చాలామంది మనసుల్లో ఈ క్షణంలో ఏవుందో నాకర్థమయింది. అలాగే ఈ కాగితం రాసిన వ్యక్తికి నా కృతజ్ఞతలు. మన సంస్థ తెరిచిన పుస్తకంలా ఉండాలని నా అభిప్రాయం." అంటూ ఆయన ఒక్క క్షణం నడుం వెనక్కు వాల్చారు. బైట వర్షం పడుతోంది. మెల్లగా మొదలై తారాస్థాయికి చేరింది. రాళ్ళు పడుతున్నట్లుగా వర్షపు జోరు మధ్యలో ఉరుములు, మెరుపులు.

"సరిగ్గా ముప్ఫయ్యేళ్ళ క్రితం అపుడు నాకు ఇవరైఒక్క సంవత్సరాలు. ఇంగ్లీష్ లిటరేచర్ ప్రధానంగా బియ్యే పూర్తి చేసాను. ఎమ్మే చదివి ఆ తర్వాత రీసెర్చి చేద్దామని నా కల! అంతలో మా నాన్నగారి హఠాత్ మరణం. ఆయన ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవారు. ఆయన చనిపోవడంతో మా బ్రతుకులు రోడ్డున పడ్డాయి. ఇంటికి పెద్దవాడినైన నా తర్వాత తమ్ముడు, చెల్లెలు, పోస్టుగ్రాడ్యుయేషన్ చేద్దామనుకున్న నా కోరికను చంపుకొని ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాను.

ఆరు నెలల ప్రయత్నం తర్వాత, మద్రాసునుంచి వెలువడుతున్న ఒక ఇంగ్లీషు దినపత్రికలో ట్రెయినీ సబ్ ఎడిటర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆరునెలల శిక్షణ తర్వాత నా ఉద్యోగం పర్మనెంటయ్యింది. నా ఆనందానికి అవధులు లేవు. నా కుటుంబాన్ని పోషించుకునేందుకు వచ్చిన ఒక సువర్ణ అవకాశం! ఆ పత్రికలో ఎంతో స్నేహపూరిత వాతావరం వుండేది. పత్రిక ఛీఫ్ ఎడిటర్ మీనన్‌గారు, ఎడిటర్ లక్ష్మణస్వామిగారు, న్యూస్ ఎడిటర్ వరదరాజులుగారు అంతా నన్ను ప్రేమగా చూసుకునేవారు. సంవత్సరం తిరిగేసరికల్లా మంచి వర్కర్‌గా పేరు తెచ్చు కున్నాను." ఆయన చెప్పడం ఆపారు.

అందరిలోనూ ఉత్కంఠ! ఆయన ఇదంతా ఎందుకు చెపుతున్నారో ఎవరికీ అర్థం కాలేదు. అయినా అందరూ ఆసక్తిగా ఆయన చెపుతున్న విషయం వైపే దృష్టిసారించారు.

ఒక్క నిముషం విరామం ఇచ్చి ఆయన చెప్పడం మొదలెట్టారు.

"అది 1979వ సంవత్సరం. ఆరోజు నేను జీవితంలో మరచిపోలేని రోజు. పత్రిక ప్రధాన సారథి మీనన్‌గారు వారికి దళపతుల్లా పనిచేసే లక్ష్మణ స్వామి, వరదరాజులుగారూ ఈ ముగ్గురూ ఢిల్లీలో అత్యవసరంగా ఏదో సెమినార్‌కు వెళ్ళవలసి వచ్చింది. వారి తర్వాత అసిస్టెంట్ ఎడిటర్ పరమేశం గారికి తరువాతి రోజు పత్రిక బాధ్యత పెట్టి వెళ్ళారు.

పత్రిక మొదటి పేజి పని పరమేశంగారు నాకు అప్పగించారు. నాకు సహాయంగా ఇద్దరు సబ్ ఎడిటర్లు. అయితే సాయంత్రం ఏడుగంటకల్లా డెస్క్‌మీద కూర్చుని రాస్తున్న పరమేశంగారు అలాగే కూలబడిపోయారు. హఠాత్తుగా హార్ట్‌స్ట్రోక్! ఆయనను అత్యవసరంగా ఐసియులో వుంచి చికిత్స ప్రారంభించారు, డాక్టర్లు. జరిగిన విషయం తెలిసిన ఎడిటర్ మీనన్‌గారు పత్రికను ఏ ఇబ్బందీ రాకుండా తీసుకువచ్చే గురుతర బాధ్యత నాకప్పగించారు. అలాగే ఆ రోజు దినపత్రిక మెయిన్ హెడ్డింగ్ చాలా సెన్సేషనల్‌గా వుంటేటట్లు చూడమన్నారు. దానికోసం సమకాలీన పరిస్థితుల్ని దృష్టిలో వుంచుకోమన్నారు.

అలా ఆయన చెప్పిన వర్తమానంతో కొండెక్కినంత సంబరం. నాతో చేరిన ముగ్గురు సబ్ ఎడిటర్లను వదిలి నాకే ప్రధాన బాధ్యత అప్పగించడంతో నా ఆనందం పతాక స్థాయికి చేరింది. రేడియో, టీవీల్లో వచ్చిన వార్తల్ని పరిశీలించాను. టెలీప్రింటర్‌లో వస్తున్న తాజా వార్తల్ని దీక్షగా చదివాను. ఆఖరికి దినపత్రికకు ఏ విషయంమీద మెయిన్ హెడ్డింగ్ పెట్టాలో ఒక నిర్ణయానికి వచ్చేసాను. అంటూ ఆయన చెప్పడం ఆపి పక్కన కూర్చున్న డిసౌజా వంక నవ్వుతూ చూసారు. ఆయన ఆ నవ్వుతో శృతి కలిపారు.

ఆయన మాటలతో ఆ సమావేశ మందిరంలో చిన్నగా గుసగుసలు. 'ముప్ఫయ్యేళ్ళ క్రితం తను పనిచేసిన ఆ పత్రిక విశేషాల గురించి ఆయన తమతో ఎందుకు చెపుతున్నట్టు? తమ అసంతృప్తికి ఆ విశేషాలకు ఏమైనా లింకు వుందా? అందరిలోనూ అవే ఆలోచనలు. వారి ఆలోచనలను భగ్నం చేస్తూ ఆయన మళ్ళీ ఉపన్యాసం మొదలుపెట్టారు.

"మీకు కొన్ని జనరల్ నాలెడ్జికి సంబంధించిన సమాచారం చెపుతాను. మన మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన 1947 నుండి 1964 వరకూ ప్రధానిగా వున్నారు. ఆయన తర్వాత లాల్ బహదూర్ శాస్త్రి 1964 నుంచి 1966 వరకు, ఆ తర్వాత ఇందిరాగాంధీ 1966 నుంచి 1977 వరకు ఆ తర్వాత 1977 నుంచి 1979 వరకూ మొరార్జీ దేశాయ్, అయితే 1979వ సంవత్సరంలోనే మరొక రాజకీయ ప్రముఖుడు ప్రధానిగా పదవి స్వీకరించారు. ఆయన 1980 వరకూ పదవిలో వున్నారు. ఆయన ఎవరు? అదే ఆనాడు మా పత్రిక పతాక శీర్షిక!" ఆ ప్రశ్న వేయగానే ఆ సెమినార్ హాల్‌లో ఒక్కసారి అంతా ఆలోచనలో పడ్డారు. వెంటనే ఆయన నవ్వుతూ "ఈ ప్రశ్నకు సమాధానం మీకు తెలిసినా చెప్పకండి." ఆ రాజకీయ ప్రముఖుడి పేరు తెలుగులో మూడక్షరాలు. షార్ట్‌కట్‌గా, ఇంగ్లీషులోనూ షార్ట్‌కట్‌లో ఆరు అక్షరాలు, ఆరోజు అప్పటికే అర్ధరాత్రి దాటింది. నా కళ్ళు మూతలు పడుతున్నాయి. అంతకుముందురోజు రాత్రి నిద్రలేదు. మెయిన్ హెడ్డింగ్‌తో పాటు మొదటి పేజీ అంతా టైప్ చేయించి ప్రూఫ్ రీడింగ్‌కి ఇచ్చి దగ్గరలోని నా రూమ్‌కి బయలుదేరాను. ప్రూఫ్ రీడింగ్ చూసే పావనమూర్తిగారికి చాలా అనుభవం ఉంది. ఆయన ప్రూఫ్ చూసి ప్రింటింగ్‌కి ఇచ్చేస్తారు. ఈలోగా ఒక కునుకు తీసి వద్దామనుకుని వెళ్ళాను.

అలారం పెట్టుకున్నాను. అయితే గంట తర్వాత లేవలేకపోయాను. లేచేటప్పటికి ఉదయం అరయ్యింది. టెన్షన్‌గా లేచాను. అయితే నా రూమ్ ముందు నేను రూపొందించిన తాజా దినపత్రిక పడి వుంది. వణుకుతున్న

చేతులతో పేపరు అందుకున్నాను. పేపరునుంచి వస్తున్న న్యూస్‌ప్రింట్ గుబాళింపును ఆస్వాదించాను.

నేను రాసిన అక్షరాలను పదే పదే చదివాను. ఆరోజు వాస్తవానికి నాకు సెలవు. అయినా ఆఫీసుకు తీరిగ్గా బయలుదేరాను. రోజూకన్నా బాగా డ్రెసప్ అయ్యాను. రోజులా బస్సులో కాకుండా ఆటో మాట్లాడుకుని ఆఫీసుకి చేరుకున్నాను. బట్టలు నలిగిపోతాయని, రోజూ మెట్లెక్కి వెళ్లే నేను లిఫ్ట్‌లో మా ఆఫీసు వుండే మూడో అంతస్తుకు చేరుకున్నాను గర్వంగా ఆఫీసు గదిలోకి అడుగుపెట్టాను. నా సీటువైపు నడిచాను.

నా డెస్కు మీద తాజా గులాబి పువ్వు అంటించిన ఒక పింక్ రంగులో వున్న కవరు కనిపించింది. నా గుండె ఒక్క క్షణం కొట్టుకోవడం ఆగిపోయింది. ఆ కవరులో ఏదో వుంది. బహుశా నన్ను ప్రశంసిస్తూ మేనేజింగ్ ఎడిటర్ గారు రాసిన ఉత్తరమా?! వణుకుతున్న చేతులతో కవరుతీసి చించాను.

లోపల వంద రూపాయనోట్లు. లెక్క పెట్టాను. నా నెల జీతం. నాకు పారితోషికంగా ఇచ్చారనుకున్నాను. ఉత్తరం తీసాను. పత్రిక లెటర్‌హెడ్ మీద టైప్ చేసిన నల్లటి అక్షరాలు. గబగబా చదివిన నాకు అంతవరకు కలిగిన ఆనందం మటుమాయ మయింది. కాళ్ళ క్రింది భూమి నన్ను పునాదులతో సహా లాగేసినట్టయింది..?'' చెప్పడం ఆపి భార్గవగారు కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నారు.

''ఇంతకీ ఆ ఉత్తరంలో ఏంవుంది?'' అందరూ అడిగారు భార్గవగారిని. ఆయన అందరి వంకా చూసి చిన్నగా నవ్వుతూ ''నన్ను ఉద్యోగంలోంచి తీసేస్తూ మేనేజి మెంటు ఇచ్చిన ఉత్తరం అది'' అన్నారు భార్గవ తాపీగా.

అందరి ముఖాల్లోనూ ఆశ్చర్యం! అందరిని పరిశీలనగా చూసి ఆయన మళ్ళీ చెప్పడం మొదలు పెట్టారు. ''నాకు ఆ ఉత్తరం చదవగానే ఏకకాలంలో కోపం, దుఃఖం కలిగాయి. నాకు ఎదురుగా న్యూస్ ఎడిటర్ వరదరాజులు

గారు. ''సార్ ఏమిటిది?'' అన్నాను దుఃఖం ఆపుకుంటూ ''మీనన్‌గారున్నారు. వెంటనే కలవండి'' అన్నాడాయన ముక్తసరిగా గబగబా మేనేజింగ్ ఎడిటర్ మీనన్‌గారి ఛాంబర్‌లోకి నడిచాను.

ఆ చల్లటి ఏసి గదిలో నాకు ముచ్చెమటలు పోసాయి. ఎప్పుడూ ప్రసన్నంగా వుండే మీనన్‌గారి ముఖంలో చిరాకు. నేనొచ్చి ఆయనను విష్ చేసినా తలెత్తకుండా ఆయన ఏదో ఫైలుచూస్తూ వుండి పోయారు. ''సార్ ఏమిటిది?'' అన్నాను మెల్లగా నాకు వచ్చిన ఉత్తరం చూపిస్తూ. నా ప్రశ్నకు సమాధానంగా ఆయన నాముందుకు ఆ రోజు వార్తా పత్రికను తోశారు. అది ఆ రోజు పత్రిక, ఈ పేపరు నాకెందుకు ఇస్తున్నారను కుంటూ యథా లాపంగా పేపరు మొదటి పేజీకేసి చూసాను. నా గుండె ఆగినంత పనయ్యింది.

ఇంతకూ మీకు చెప్పనే లేదు. 1979లో శ్రీ మురార్జీదేశాయ్ తర్వాత ప్రధాని పదవిని అధిరోహించింది శ్రీ చరణ్‌సింగ్. అదే మెయిన్ హెడ్డింగ్‌గా 'కాబోయే ప్రధాని చరణ్!'' అని టైప్‌చేసి ప్రూఫ్ రీడింగ్‌కు ఇచ్చాను. మరి ఈ పేరులో 'కాబోయే ప్రధాని చవాన్' అని వుందేమిటి? అయోమయంగా చూస్తూ ''సార్ ఉదయం నాకు మన పేపరు వచ్చింది. కరక్టుగానే ఉంది'' అన్నాను తలొంచుకుంటూ.

వెంటనే ఆయన ఒక ఫైలు అందించారు. అంతకుముందు రోజు నేను మొదటి పేజీ నిమిత్తం మొయిన్ హెడ్డింగ్‌తో సహా టైప్ చేసిన కాగితాలు. ఔను ఆ కాగితాలు చూడగానే నేను చేసిన తప్పేమిటో అర్థమయింది. 'కాబోయే ప్రధాని చవాన్' అని టైపు చేసిన కాగితం నా సంతకంతో స్వయంగా ఉంది.... అదే, ప్రూఫ్ రీడింగ్‌కి ఆ తర్వాత వెళ్ళిపోయింది. మరైతే మా ఇంటికి వచ్చి కాంప్లిమెంటరీ కాపీ కరెక్టుగా వుంది. ఈ వార్తను సరిదిద్దింది ఎవరు? చవాన్ అనే పేరులో ఆరు ఇంగ్లీషు పదాలు, చరణ్‌లో అదే విధంగా వుండడంతోపాటూ, ఎస్‌తో పూర్తవడం, మొదటి పేజీలో చవాన్‌గారి గురించిన

వార్తలు నేనే టైప్ చేయడంతో పొరపాటు జరిగిపోయింది. అందుకు ఫలితం నా ఉద్యోగానికి ఉద్వాసన!

రేపటినుంచి నా కుటుంబం రోడ్డున పడుతుంది. నాలో దుఃఖం ముంచు కొచ్చింది. "సార్ ఇంకెప్పుడూ తప్పు చేయను. చాలా జాగ్రత్తగా ఉద్యోగం చేసుకుంటాను" అంటూ ఏడ్చేసాను. ఆయన నా వంక జాలిగా చూసారు. నన్ను విధులనుంచి తొలగిస్తూ వారిచ్చిన ఉత్తరాన్ని నా కళ్ళముందే చించేసారు.... జాగ్రత్తగా పనిచెయ్యండి.... వృత్తిలో క్రమశిక్షణ అవసరం." అన్నారు నా భుజం తడుతూ ఆయనకు రెండు చేతులూ జోడించి ముందుకు నడిచాను. ఆయన మళ్ళీ పిలిచాడు వెనక్కి తిరిగాను ఇదిగో భార్గవ్ ముందుగా వెళ్ళి ఫ్రాన్సిస్‌కి థేంక్స్ చెప్పు" అన్నాడు.

"ఫ్రాన్సిస్... ఔను ఈ పేరు నేను రోజూ వింటున్నదే. మాకు అందరికీ రోజుకి నాలుగైదుసార్లు టీలు అందించే గోవా కుర్రవాడు ఫ్రాన్సిస్. అతని వయసు పదహారేళ్ళుంటుం దేమో! ఆ టీ కుర్రాడికి థేంక్స్ చెప్పాలా? దేనికో! గబ గబా క్రిందకు నడిచాను. ఫ్రాన్సిస్ కనిపించాడు-"

భార్గవగారు చెప్పడం ఆ పేరు. ఆ సెమినార్ హాల్‌లోని అందరికీ టీలు, బిస్కట్లు వచ్చాయి. భార్గవగారి ఉపన్యాసానికి బ్రేక్ పడింది.

'ఇంతకీ ఫ్రాన్సిస్ ఎవరు? భార్గవగారు అతగాడికి థేంక్స్ ఎందుకు చెప్పారు?' ఇవీ ఆ ఉద్యోగుల మనసులో మెదిలిన కొత్త ప్రశ్నలు.

భార్గవగారు టీ త్రాగడం పూర్తిచేసారు. ఆయన అందరివంకా పరిశీలనగా చూసారు. సెమినార్ హాలంతా నిశ్శబ్దంగా అయిపోయింది. ఆయన తన ఉపన్యాసం కొనసాగించారు. "ఆ రోజు నేను పొరపాటుగా టైప్‌చేసిన మెయిన్ హెడ్డింగ్ వార్త మూడు దశలలో ముగ్గురునుంచి అలా తప్పుగా దొర్లిపోయింది. మొదటి ఎడిషన్ ప్రింటయి బైటకొచ్చింది. అప్పుడు సమయం ఒంటి గంట దాటింది. టీ కుర్రాడు ఫ్రాన్సిస్ తన కెటిల్‌తో టీలు పట్టుకొచ్చాడు. ప్రెస్‌లోంచి

బైటకొచ్చిన మొదటి పేపరు చూసాడు. జరిగిన తప్పు గుర్తించాడు. ప్రూఫ్ రీడింగ్ సెక్షన్‌లో వారికి తెలియజేసాడు. అలా ఏడెనిమిది పేపర్లలో మాత్రం ఆ తప్పు దొర్లింది. ఆ పేపర్లను గొడౌన్‌లో దాచారు. మార్కెట్‌లోకి, పబ్లిక్‌లోకి వెళ్ళకుండా జాగ్రత్తపడ్డారు. అలా ఆ రోజు ఆ టీ కుర్రాడు మా పత్రిక పరువు పోకుండా కాపాడేడు, నా ఉద్యోగాన్ని నిలబెట్టాడు. అందుకే మా ఎడిటర్ మీనన్ గారు ఫ్రాన్సిస్‌కు థేంక్స్ చెప్పమన్నారు...'' అంటూ భార్గవగారు న్యూస్ ఎడిటర్ డిసౌజా వంక చూసారు. ఆయన భార్గవగారి వంక నవ్వుతూ చూసాడు.

''ఇంతకీ ముప్ఫయ్యేళ్ళ క్రిందటి 'థేంక్స్ టు ఫ్రాన్సిస్' కథ మాకు ఎందుకు చెప్పినట్టు సార్, ఇంతకీ ఫ్రాన్సిస్ ఎవరు? అంటూ ఒక ఉద్యోగి లేచి నిలబడి అడిగాడు. ఆ మాటలకు భార్గవగారు నవ్వుతూ, ''ఉండండి కథ ఇంకా పూర్తి కాలేదు'' అంటూ మళ్ళీ చెప్పడం మొదలుపెట్టారు.

''తరువాత ఆరోజునే ఫ్రాన్సిస్‌కు మా పత్రికలో ఉద్యోగం వచ్చింది ప్రూఫ్ రీడర్‌గా ఆరు నెలల్లో అతను సబ్ ఎడిటర్‌గా ప్రమోషన్ పొందాడు. పత్రికలో ఉద్యోగం చేస్తూనే డిగ్రీ పూర్తి చేసాడు. స్వయంకృషితో ఎదిగాడు. నాకు మంచి ఆప్త మిత్రుడయ్యాడు. అప్పటికే ఆ పత్రికలో నేను ఐదేళ్ళ సర్వీసు పూర్తిచేసాను. అయితే చెన్నైనుంచి హైదరాబాదు వచ్చేద్దామనే ఉద్దేశంతో ఆ పత్రికలో ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి హైదరాబాదులో బ్యాంకులోను తీసుకుని చిన్న దినపత్రికను ప్రారంభించాను. అప్పటికే నేను వదిలేసిన పత్రికలో మంచి పొజిషన్‌లో వున్న ఫ్రాన్సిస్ అదంతా వదులుకుని నాతోపాటు వచ్చేసాడు'' అంటూ చెప్పడం ఆపి అందరి వంక చూసారు భార్గవగారు.

ఆయన మాటకు అందరికి షాక్ కలిగినట్టయింది. తమకు తెలిసి తమ పత్రికలో పాతికేళ్ళుగా ఏ ఫ్రాన్సిస్సూ లేదు. ఇంతకీ ఎవరితను? అనుకున్నారు.

భార్గవగారు లేచి నించుని అందరికీ రెండు చేతులూ జోడించి, ''క్షమిం

చండి మీలోని ఉత్కంఠకు తెర తీస్తున్నాను. మన డిసౌజాగారి పూర్తి పేరు ఫ్రాన్సిస్ డిసౌజా. ఆయన డిసౌజా అనే కలం పేరుతో రచనలు చేయడంతో ఆ విధంగా పాపులర్ అయ్యారు...'' అంటూ ఆయన డిసౌజాను ఒక్కసారి గుండెలకు హత్తుకున్నారు.

డిసౌజా కళ్ళలో నీళ్ళు, భార్గవగారు డిసౌజా భుజం మీద చెయ్యవేసి, ''మిత్రులారా! 1979వ సంవత్సరంలో నేను చేసిన ఆ తప్పును ఎప్పటికీ మరచిపోలేను. ప్రతీ వృత్తిలోనూ, క్రమశిక్షణ, నిబద్ధత ఉంటే ఎంత ఎత్తుకైనా ఎదగ గలమనే సంకల్పం ముప్పయ్యేళ్ళ క్రితం నాకు ఈ ఫ్రాన్సిస్ ద్వారా అర్థమయింది. అదే దిశగా చిన్న పత్రికలో ప్రయాణమైన నా పత్రికా జీవితం నేడు ప్రముఖ జాతీయ దినపత్రిక సంపాదకుడిగా ఎదిగింది ఈ ఎదుగుదలలో ఫ్రాన్సిస్ లాంటి మిత్రుడు చేసిన సహాయం మరువలేనిది.

ఆనాడు నా ఉద్యోగం కాపాడడంతోపాటు ఇన్నేళ్ళ తరువాత మీకందరికీ ఉపాధి కల్పించే మార్గంలో ప్రాన్సిస్ నా వెన్నంటే ఉన్నాడు. అలాంటి ఫ్రాన్సిస్ ఏ రాష్ట్రం వాడయితేనేం? ప్రతిభ ఎక్కడున్నా గౌరవించే సంస్కారం. సహృదయత కలిగిన వసుదైక కుటుంబం మనది, అంచేత మీ మనస్సులోని తెరలు తొలగించండి. విశ్వమానవులుగా ముందుకు సాగుదాం...'' అంటూ భార్గవగారు తన ఉపన్యాసం ముగించారు.

వర్షం వెలిసింది. కిటికీలకున్న కర్టెన్లనను తొలగించారు. మెల్లగా కిటికీ ల్లోంచి వస్తున్న శీతల పవనాలు ఆ గదిలోని వాతావరణాన్ని చల్ల బరచాయి. భార్గవగారి మాటలతో అందరి గుండెల్లో ఎంతో స్వాంతన. తేలికపడ్డ మనసుతో ఆ సభలోని వారంతా నూతనంగా పదవి పొందిన ఫ్రాన్సిస్ డిసౌజా గారిని అభినందించారు. ఒక్కసారిగా సభ అంతా చప్పట్లతో మారు మ్రోగి పోయింది. ''అందరిలోనూ సమైక్య రాగం వినిపిస్తోంది'' అంటూ భార్గవ్‌గారు ఫ్రాన్సిస్ డిసౌజా చేతులను మరోసారి స్పృశించి అక్కడనుంచి వేగంగా కదిలారు.

(ఆదివారం ఆంధ్రభూమి 30-10-2013)